ప్రజాశక్తి
శనివారం 23 మార్చి 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఎంపీ స్థానాలకు పెమ్మసాని, లావు

- బాపట్లకు తెలంగాణ బిజెపి నేత కృష్ణప్రసాద్
- ఖరారు చేసిన టిడిపి అధిష్టానం
- నర్సరావుపేటలో చదలవాడకే చోటు
- అసంతృప్తికి గురైన సీనియర్ నేతలు
- ఎవరు ఎలాంటి వారో అర్థమైంది : ఉండవల్లి శ్రీదేవి

పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో టిడిపి తరుపున పోటీ చేసే అభ్యర్థుల మూడో జాబితాను శుక్రవారం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నర్సరావుపేటకు వైసిపికి రాజీనామా చేసిన సిట్టింగ్ ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలును ఖరారు చేశారు. వీరిద్దరు ఇప్పటికే ప్రచారంలో కొనసాగుతున్నారు. తాజాగా బాపట్ల లోక్‌సభ స్థానానికి తెలంగాణ బిజెపి అధికారి ప్రతినిధి టి.కృష్ణప్రసాద్‌కు కేటాయించడం టిడిపి నాయకులను విస్మయానికి గురిచేసింది. కృష్ణప్రసాద్ బిజెపి నుంచి వరంగల్ టిక్కెట్ కోరుకోగా అనూహ్యంగా ఆయనకు బాపట్ల టిక్కెట్టు ఇచ్చారు. దీంతో ఈ సీటు ఆశించిన పలువురు దళిత నేతలు అసంతృప్తికి గురయ్యారు. పార్టీతో సంబంధం లేనివారికి ఇవ్వడంపై పలువురు నేతలు కినుక వహించారు. ఈ నిర్ణయంతో బాపట్ల టిక్కెట్ ఆశించిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి తీవ్ర నిరాశకు గురయ్యారు. 'రాజకీయాలు ఎలా ఉంటాయో, ఎవరు ఎలాంటి వారో ఈ రోజు అర్థమైంది' అంటూ ఉండవల్లి శ్రీదేవి తన అసహనాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. గతేడాది మార్చిలో వైసిపి నుంచి సస్పెండ్ అయిన తరువాత కొద్ది కాలానికి ఆమె టిడిపిలో చేరారు. ఇటీవల ఆమె తిరువూరు, బాపట్ల స్థానాలను ఆశించినా ప్రయోజనం దక్కలేదు.

మరోవైపు అసెంబ్లీ స్థానాలకు పెండింగ్‌లో ఉన్న నర్సరావుపేట నుంచి ప్రస్తుత ఇన్‌ఛార్జి చదలవాడ అరవిందబాబును ఎంపిక చేశారు. ఆయన స్థానంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి అవకాశం ఇవ్వాలని శ్రీకృష్ణదేవరాయలు ప్రతిపాదన నెక్కలేదు. ఆరేళ్లపాటు పార్టీ కోసం పనిచేసిన అరవిందబాబు కాదని ఇప్పటికీ పార్టీలో చేరని జంగా కృష్ణమూర్తికి అవకాశం ఇస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని భావించిన చంద్రబాబు.. అరవిందబాబు వైపు మొగ్గు చూపారు.

ఈసారి టిక్కెట్లు దక్కని సీనియర్లను చంద్రబాబు నాయుడు, లోకేష్ బుజ్జగిస్తున్నారు. జనసేన పొత్తు వల్ల తెనాలి టిక్కెట్ దక్కకపోయినా

▶ 2లో

వాలంటీర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రచారాల్లో ఉద్యోగులు, వాలంటీర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎవరు పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల ఎన్నిక కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత రాజకీయ నాయకుల సమావేశాలకు హాజరైన 12 మంది వాలంటీర్లను, ప్రజాప్రతినిధులతో ప్రచారాల్లో ఉన్న ఇద్దరు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తూ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాల్సిందేనని, నిబంధనలు మీరి ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచార సభల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. ఇటీవల ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓ పార్టీ అభ్యర్థి తన నివాసంలో నిర్వహించిన రాజకీయ సమావేశానికి స్థానిక సచివాలయాల పరిధిలోని వాలంటీర్లు హాజరైనట్లు గుర్తించామన్నారు. గుంటూరు ఆర్‌డిఒ నివేదిక మేరకు సమావేశానికి హాజరైన అల్లాడి స్వాతి, ఎస్.సుధాకృష్ణవేణి, కె.నాగావర్ధనిదేవి, యు.పుష్పాంజలి, డి.నీలిమ, ఎం.నాగేశ్వరరావు, ఎ.భాగ్యలక్ష్మి, ఎం.శిరీష, డి.శిరీష, బి.సాయి, పి.భాగ్యశ్రీ, పి.సురేంద్రబాబును వాలంటీర్ల విధుల నుండి తొలగించినట్లు తెలిపారు. జిఎంసికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఇద్దరు మినహా అందరు రిపోర్ట్ చేశారని, రిపోర్ట్

▶ 2లో

నిబంధనల ఉల్లంఘన - పెమ్మసాని, గల్లా మాధవిపై కేసు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి : గుంటూరులో అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రజలకు తీవ్ర అసౌకర్యం కల్పించినందుకు గుంటూరు అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో టిడిపి లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ నియోజకవర్గం టిడిపి అభ్యర్థి గల్లా మాధవి, నాయకులు కోవెలమూడి రవీంద్రపై కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఎన్నికల అధికారుల నుంచి అనుమతి తీసుకోకుండా, సమాచారం ఇవ్వకుండా ప్రచారంలో పాల్గొని ట్రాఫిక్ అంతరాయం కల్గించినట్టు ఎన్నికల అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వీరితోపాటు మరికొంతమంది నాయకులపైనా కేసు నమోదు చేశారు. సెక్షన్ 143, 341, 290, 188, 171, 149 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సమస్యాత్మక నియోజకవర్గాలలో మాచర్లది ప్రత్యేక స్థానం

- 299 పోలింగ్ కేంద్రాలుండగా 144 సమస్యాత్మకమైనవే
- శాంతి భద్రతల సమస్యలపై కఠినంగా వ్యవహరిస్తాం
- నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పల్నాడు జెసి శ్యామ్‌ప్రసాదు

కారంపూడిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జెసి

ప్రజాశక్తి - మాచర్ల, కారంపూడి

జిల్లాలోని సమస్యాత్మక నియోజకవర్గాల్లో మాచర్ల అతి సమస్యాత్మకమని జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన కారంపూడిలోని జెడ్పి పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను జెసి శుక్రవారం తనిఖీ చేశారు. మాచర్లకు వచ్చి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో 299 పోలింగ్ కేంద్రాలుండగా, వీటిల్లో 144 కేంద్రాలు సమస్యాత్మకమైనవని చెప్పారు. వీటిల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు వెబ్‌క్యాస్టింగ్, ఎక్కువ సంఖ్యలో పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనా వళి అమలుపై ప్రతిరోజూ పరిశీలిస్తున్నామని, ప్లెక్సీలు, హోర్డింగ్‌లు, నిబంధనలకు విరుద్ధంగా అంటించిన ఫొటోలను తొలగించామని తెలిపారు. పెద్ద,పెద్ద నిర్మాణాలపై ఉన్న పార్టీ రంగులను పూర్తిగా తొలగించేందుకు అవకాశం లేకపోవటంతో దానిలో ఒక రంగును చెరిపివేయటం, మరో రంగును చేర్చటం వంటి మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని పార్టీలు ప్రచారం

▶ 2లో

ప్రజా సమస్యల పరిష్కారం కోసం
ప్రాణ త్యాగానికైనా వెనకాడనిది ఎర్రజెండానే

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రాణ త్యాగానికైనా వెనకాడకుండా పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. సిపిఎం తాడేపల్లి మండల విస్తృత సమావేశం కుంచనపల్లిలో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం నాయకులు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నమ్మబలికాడని, అధికారంలోకి వచ్చాక మోసం చేయడంతోపాటు నిత్యావసర, ఇంధన ధరలు, ఇతర భారాలు పెంచారని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేయడానికి మూడు నల్ల చట్టాలు తేగా రైతులు పోరాటాలతో వాటిని తిప్పికొట్టారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లు చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న బిజెపి విధానాలకు అనుకూలంగా రాష్ట్రంలోని అధికార

▶ 2లో

సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

రెండ్రోజుల్లో మళ్లీ సమావేశమవుదాం

ఏకీభవిస్తే కలిసి నడుద్దాం : మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-తెనాలి

రాజ్యం టాకీస్ వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తగా పార్టీలోకి వచ్చి యువజన విభాగం నాయకుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవులలంకరించానని, వ్యక్తి స్వార్థం కంటే పార్టీ శ్రేయస్సు ముఖ్యమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక పాత రాజ్యం టాకీసులో అత్యవసర సమావేశంలో శుక్రవారం రాత్రి పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల, కార్యకర్తలతో మాట్లాడారు. తెనాలి స్థానం ఆశించిన

▶ 2లో

వాస్తవికత లోపించిన భారత మీడియా

- అధికంగా వ్యక్తి పూజ, కులం, మతం ప్రభావం
- డిజిటల్ మీడియా అన్ఫోల్డింగ్ ఆఫ్ న్యూ పొటెన్షియల్' అంశంపై వర్సిటీలో వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

డిజిటల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకోలేని స్థితిలో ప్రపంచం ఉందన్నాని, పాశ్చాత్య మీడియాలో ఉన్నంత వాస్తవికత భారతీయ మీడియాలో కనిపించడం లేదని పలు సర్వేలు చెబుతున్నాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొపెసర్ పి.రాజశేఖర్ అన్నారు. వర్సిటీలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో 'డిజిటల్ మీడియా అన్ఫోల్డింగ్ ఆఫ్ న్యూ పొటెన్షియల్' అంశంపై రెండ్రోజుల జాతీయ వర్క్‌షాప్ శుక్రవారం

▶ 2లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం సాయంత్రం) : 6.24

సహరీ (ఆదివారం ఉదయం) : 4.53

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం, సిబ్బంది

'చలపతి' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో చెన్నైకు చెందిన యాంఫినాల్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 37 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ తెలిపారు. ఎంపికైన వారికి రూ.2.3 లక్షలు వార్షిక వేతనం అందుతుందని కంపెనీ ప్రతినిధులు జె.ఎదినరాజ, యల్.సుబ్బరాయన్ తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ వై.రోషన్ కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

వాస్తవికత లోపించిన భారత మీడియా

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైంది. కార్యక్రమకానికి విభాగాధిపతి డాక్టర్ జి.అనిత అధ్యక్షత వహించారు. వీసీ మాట్లాడుతూ ఆధునిక మీడియా రంగంలో వస్తున్న మార్పులపై విస్తృత అధ్యయనాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారత మీడియాలో మానవ నిర్మిత మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని, వ్యక్తి పూజ, కులం, మతం వంటి అంశాలపై అధికంగా ఉంటుందని అన్నారు. కొన్ని రకాల మీడియా వ్యక్తి ఆలోచనను నియంత్రిస్తుందని చెప్పారు. డిజిటల్ మీడియాలో వ్యక్తి స్వాతంత్రం, స్వేచ్ఛ కనిపించవనే విషయాన్ని ప్రముఖ ఆంగ్ల రచయిత మార్షల్ మెక్లుహర్ చెప్పారని అన్నారు. మానవుడికి కావలసిన సమాచారం నేడు అందుబాటులో ఉండటం కొంత ఆహ్వానించదగినా కొన్ని రకాల ఇబ్బందులు కూడా ఉంటాయన్నారు. సమాజాన్ని దిక్సూచిగా నిలిపే విషయంలో మీడియా తన పాత్రను పోషించే క్రమంలో ప్రజలకు వాస్తవాలను తెలియపరచాలని సూచించారు. జర్నలిజం విద్యార్థులు ఒక మూస ధోరణిలో ఇమిడిపోద్దన్నారు. సమాచారం ఉన్నవారే సాధికారత సాధించిన వారిగా నిలుస్తారని చెప్పారు. చాట్ జిపిటి కంటే వికీపీడియాలోనే ఎక్కువ యథార్థత ఉందన్నారు. డిజిటల్ మీడియా రంగంలో నూతన పోకడలపై చెన్నైలోని అన్నా యూనివర్సిటీ మీడియా సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఐ.అరుల్ ఆరం కంటెంట్‌ను రూపొందించే విధానాన్ని, డిజిటల్ మీడియాలో వస్తున్న సమాచారంలో వాస్తవికతను ఎలా గుర్తించాలో వివరించారు. అనంతరం పలు అంశాలపై ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. స్వరూపారాణి, పాలకమండలి సభ్యులు వి.వెంకటేశ్వరరావు, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ విభాగాధిపతి సారధికృష్ణ మాట్లాడారు. గూగుల్ ఇనిషియేషన్ గ్లోబల్ ఎక్స్పర్ట్ ఫేక్ న్యూస్ ఫ్యాక్ట్ చెక్ ఇన్వెస్టిగేషన్స్ ఎడిటర్ ఉడుముల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా పాత్ర నేడు అత్యంత వేగంగా పెరిగిందన్నారు. వర్క్‌షాప్ డైరెక్టర్ జి.అనిత మాట్లాడుతూ సమకాలిన అంశాల్లో డిజిటల్ టెక్నాలజీ, ఆన్లైన్ మీడియా, సోషల్ మీడియా రంగాలు విస్తృతంగా అభివృద్ధి చెందాయన్నారు. అయితే వాటి ద్వారా సమాజ పునర్నిర్మాణం ఎలాగో వివరించడమే వర్క్‌షాప్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ జె.మధుబాబు, పాల్గొన్నారు.

జనసేన నాయకులపై వైసిపి దాడి

కారు ధ్వంసం, పలువురికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల : దుర్గి మండలం జంగమేశ్వర పాడు వద్ద తమపై వైసిపి నాయకులు దాడి చేశారని జనసేననాయకులు శుక్రవారం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి పసుపులేటి ప్రసాదు, పసుపులేటి హనుమంతరావు, దాసరి చెన్నయ్య, సింగంశెట్టి మధులు మాచర్ల నుండి మించాలపాడు గ్రామం వెళుతుండగా మార్గమధ్యలో జంగమేశ్వర పాడు వద్ద వైసిపి నాయకులు కాపు కాసి తమని తీవ్రంగా గాయపరిచి బెదిరించారని, కారు ధ్వంసం చేశారని తెలిపారు. దుర్గి మండలం జంగమేశ్వర పాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మన్నయ్య అతని అనుచరులు ఈ దాడికి పాల్పడినట్టు బాధితులు తెలిపారు. దుర్గి పోలీసు లకు ఈ మేరకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. మాచర్ల నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్యాం ప్రసాద్ వైసిపి చేందిన 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోండి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

విద్యార్థులు విద్యతోపాటు సరికొత్త ప్రాజెక్టులు, నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలని కెనడా సిపిపి డైరెక్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ హేమ జంపాల విద్యార్థులకు సూచించారు. శుక్రవారం కెఎల్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న జ్రోత్రియా- 24 వేడుకలలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెఎల్ యులో విద్యార్థులకు అధునాతన లేబరేటరీలు, అంకితబావం కలిగిన అద్యాపకులు అందుబాటులో ఉన్నారని ప్రశంసించారు. ఇసిఇ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సుమన్ మాట్లాడుతూ ఈసీఈ విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ రెండు విభాగాలలో మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు ప్రాగ్య పర్వ అను నేపథ్యంతో పవర్,టాలెంట్ ఆఫ్ పార్టిసిపేషన్ నేపథ్యంలో జరుగుతున్నట్లు చెప్పారు. జ్రోత్రియా చైర్ పర్సన్ డాక్టర్ కెసిహెచ్. కావ్య, కన్వీనర్ పి. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ వేడుకలలో ఇసిఇ విభాగ విద్యార్థులందరూ నెట్వర్క్స్, షోకేస్ టాలెంట్ ప్రదర్శించి వారి ప్రతిభాపాటవాలను ప్రదర్శించారని, జ్రోత్రియా సాంకేతిక పోటీల్లో విద్యార్థులు కోడింగ్, రోబోటిక్స్, పేపర్ ప్రజెంటేషన్ తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కెఎల్ యుకు 3వ వాటర్ సస్టైనిబిలిటీ అవార్డ్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీకి పాటిస్తున్న నీటి యాజమాన్య పద్దతులకు 2023-2024 విద్యా సంవత్సరానికిగాను 3వ వాటర్ సస్టైన బిలిటీ అవార్డ్ వచ్చినట్లు వైస్ చాన్సులర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గుంటూరు నగరంలో పోలీసు కవాతు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం కేంద్ర పారామిలటరీ బలగాలతో స్థానిక పోలీసు అధికారులు కవాతు నిర్వహించారు. తూర్పు డివిజన్ ఎఎస్‌పి నిచికేట్ షెల్కి, అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి పి.శాంతకుమార్, ఆయా పోలీసు స్టేషన్లలోని సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక హిమనీ సెంటర్ నుండి పూల మార్కెట్ సెంటర్, లాంచెస్టర్ రోడ్, బారాఇమమ్ పంజా, బీన్నూరు రోడ్, బోస్ బోమ్మ సెంటర్, నాజ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో పోలీసు కవాతు చేశారు.

వాలంటీర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

చేయకుండా ఎన్నికల ప్రచారంలో ఉన్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులైన నాగకుమార్ (పర్సనల్ అసిస్టెంట్), సతీష్ (డ్రైవర్)ను విధుల నుండి తొలగించామన్నారు. డిప్యూటీ మేయర్ వద్ద ఉన్న జిఎంసి ఔట్సోర్సింగ్ సిబ్బందంతా రిపోర్ట్ చేశారని తెలిపారు.

కొరవడిన నిఘా

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రత్తిపాడు మండల వాలంటీర్లకు సంబంధించిన చర్యలు ఎంపిడిఒ తీసుకోవాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు భేఖాతరు చేస్తూ వైసిపి అభ్యర్థులు తమ రాజకీయ ప్రచారంలో వాలంటీర్లు, ఉద్యోగులను ఉపయోగిస్తున్నారు. పత్రికల్లో వార్తలు వచ్చినా, ప్రత్యర్థి రాజకీయ పార్టీలు ఫిర్యాదుచేస్తే అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నారు. ప్రజా ప్రతినిధుల వద్ద పనిచేస్తున్న వారంతా తమ శాఖల్లో రిపోర్టు చేయాలని ఆదేశించినా ఇంకా కొంతమంది పిఎలు, పిఎస్‌లు ప్రజా ప్రతినిధుల వద్ద కొనసాగుతున్నట్టు తెలిసింది. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో టిడిపి హయాంలో అప్పటి ప్రజా ప్రతినిధుల వద్ద పనిచేసిన వారూ సంబంధిత నాయకుల వద్ద అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నా నిఘా కొరవడింది.

ప్రాణ త్యాగానికైనా వెనకాడనిది ఎర్రజెండానే

(మొదటి పేజీ తరువాయి)

వైసిపి, ప్రతిపక్ష టిడిపి వ్యవహరిస్తున్నారని, ఆయా బిల్లులకు అనుకూలంగా పార్లమెంటులో ఆ పార్టీల ఎంపీలు ఓట్లేశారని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని, పోలవరం నిర్మాణానికి నిధులు విషయంలోనూ కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. నల్లధనాన్ని విదేశాల నుండి వెనక్కు తెచ్చి ప్రజల ఖాతాలోల వేస్తామని చెప్పిన మోడీ అనంతరం ప్రజలపై రూ.110 లక్షల కోట్ల అప్పుల భారాన్ని వేశారని విమర్శించారు. మరోవైపు అదాని, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారన్నారు. బిజెపి విధానాలను ప్రశ్నిస్తున్న, వ్యతిరేకిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయించి భయ బ్రాంతులకు గురి చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. దేశానికి పెనుముప్పుగా మారిన బిజెపిని, దాని కూటమి పార్టీలైన టిడిపి, జనసేనను, మెతక వైఖరి అవలంబిస్తున్న వైసిపిని ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినికాంత్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షాలను లేకుండా చేసేందుకు పూనుకుందన్నారు. నిరంకుశ, కక్షపూరితమైన రాజకీయాలు చేస్తోందన్నారు. అదే విధానాలను రాష్ట్రంలోని వైసిపి కూడా అమలు చేస్తోందన్నారు. 99 శాతం సంక్షేమ పథకాలను అందించామని చెప్పిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కార్మికులు తమ హక్కుల కోసం ఆందోళన చేస్తే పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. రైతాంగ, కార్మిక ఉద్యమాలకు సిపిఎం పూర్తి అండగా నిలిచి పోరాడిందని, ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ బూర్జువా పార్టీలు ప్రజాసేవ కంటే, వ్యాపారాల కోసమే రాజకీయాన్ని ఉపయోగిస్తున్నారని అన్నారు. తాడేపల్లి ప్రాంతంలో సిపిఎం నాయకులు సర్పంచులుగా ప్రజలకు అనే సేవలు అందించారని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో సుమారు 20 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సిపిఎంకు ఉందని ఆ పార్టీ అభ్యర్థులకు ఓటేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి, నాయకులు ఎ.రంగారావు, కుంచనపల్లి మాజీ సర్పంచ్ ఎ.సాంబయ్య, నాయకులు డి.రాజేంద్రబాబు, పి.కృష్ణ. కె.శివన్నారాయణ, కె.జేమ్స్, కె.సాంబశివరావు, కె.శ్రీనివాసరావు, ఎ.రామారావు, కె.యశోద, ఎన్‌వి రాజు, ఎస్.రవికిషోర్, కె.స్వాతి, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీ స్థానాలకు పెమ్మసాని, లావు

(మొదటి పేజీ తరువాయి)

మరోచోటైనా అవకాశం దక్కుతుందని భావించిన మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. ఇటీవల ఆయనకు కృష్ణా జిల్లా పెనమలూరు సీటు ఇస్తారని ప్రచారమైనా ఎక్కడా అవకాశం ఇవ్వలేదు. అసంతృప్తితో ఆయన పార్టీని వీడతారని శుక్రవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో ప్రచారం జరిగింది. రాత్రి 7 గంటలకు తెనాలిలో అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆయన అనుచరులు ప్రకటించారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు జోక్యం చేసుకుని ఆలపాటిని ఉండవల్లిలోని చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లి బుజ్జగించినట్టు తెలిసింది. దీంతో ఆలపాటి మెత్తపడ్డట్టు సమాచారం.

సమస్యాత్మక నియోజకవర్గాలలో మాచర్లది ప్రత్యేక స్థానం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవచ్చని సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుని, అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అన్ని పర్మిషన్లు ఆర్ఓ కార్యాలయం ద్వారానే జరుగుతాయన్నారు. ఇతర శాఖలతో కూడా ఇక్కడ నుండే చర్చించి పార్టీ నాయకులు పెట్టుకున్న దరఖాస్తుపై తుది అనుమతి ఇస్తామని తెలిపారు. ఆయా పార్టీల ప్రతినిధుల నుండి ఎన్నికల నిబంధలకు విరుద్ధంగా ఉన్న అంశాలపై 150 ఫిర్యాదులు అందాయని, వీటిని పరిశీలించామని తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలో నాలుగు రోజులుగా వరసగా హింసాత్మక సంఘటనలు జరుగుతున్నాయని, మంగళవారం టిడిపి పార్టీకి చెందిన వారి కారు దహనం చేయగా ఈ కేసులో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. గురువారం రాత్రి జనసేన పార్టీ నాయకులపై దాడి, వాహనాన్ని ధ్వంసం చేశారని, మాచర్లలోని 8వ వార్డులో మరో వాహనాన్ని దహనం చేశారని చెప్పారు. దుర్గి మండలంలో జరిగిన సంఘటనలో 11 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మాచర్లలో బొలేరో వాహన దహనం సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. శాంతి, భద్రతల విషయంలో కఠినంగా వ్యహరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎవరైనా సమస్యలపై తమకు సమాచారం ఇవ్వొచ్చని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. మాచర్ల నియోజకవర్గంలో 2,60,533 మంది ఓటర్ల నమోదవగా వీరిలో పురుషులు 1,27,727, స్త్రీలు 1,32,784, ట్రాన్స్ జెండర్ 22 మంది ఉన్నట్లు తెలిపారు. ఎక్కువ సిసి కెమోరాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ఎన్నికల నియమావళి ఉల్లంగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలపై పటిష్టమైన నిఘా ఏర్పాటుకు ఆదేశించారు. జెసివెంట ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రామాంజనేయులు, తహశీల్దార్, విఆర్‌ఒలు, బిఎల్వోలు ఉన్నారు.

రెండ్రోజుల్లో మళ్లీ సమావేశమవుదాం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన అది దక్కకపోవటంతో తీవ్ర నిరాశకు గరైన సంగతి తెలిసిందే. అయితే పార్టీ అధినేత చంద్రబాబునాయుడు స్వయంగా మాట్లాడటంతో ఆయన మెత్తబడ్డారు. అయితే గుంటూరు-2 నుంచి గాని, పెనమలూరు నుంచి గాని అవకాశం లభిస్తుందని పార్టీలో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పార్టీ అదిష్టానం ప్రకటించిన జాబితాలో ఆయనకు అవకాశం దక్కకపోవటతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. తెనాలి కావాలని పదేపదే అడిగినా ఇవ్వకపోగా, తన ప్రమేయం లేకుండా పెనమలూరు నియోజకవర్గంలో తన పేరు పరిశీలనలో ఉన్నట్లు చెప్పి, ఇప్పుడు అక్కడా అవకాశం లభించపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ద్వితీయ శ్రేణి నాయకులకు సమాచారం ఇచ్చారు. సాయంత్రం 4 గంటలకు అత్యవసర సమావేశం ఉందంటూ పార్టీ కార్యాలయం నుంచి శ్రేణులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం నుంచి పిలుపు రావటంతో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు నక్కా అనందబాబుతో కలిసి చంద్రబాబునాయుడిని కలిసేవందుకు వెళుతూ అత్యవసర సమావేశాన్ని రాత్రి ఏడుగంటలకు ప్రకటించారు. అయితే తిరిగి ఆయన వేదికకు చేరుకునే సరికి రాత్రి పది గంటలైంది. అయినా పార్టీ నాయకులు కార్యకర్తలు మాత్రం ఆయన రాకకోసం వేచి ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తనకు సీటు లభవించకపోవటం, పెనమలూరు స్థానంపై తనతోపాటు ఆశపెట్టుకున్న నాయకులకు కూడా నిరాశే మిగలటం బాధ కలిగించిందన్నారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఎంతో మంది ప్రోత్సహించినట్లు చెప్పారు. అయితే పార్టీ అధినాయకుడిని, ఆయన కుటుంబాన్ని కించపరచిన వ్యక్తులను, ఆపార్టీని ఓడించాలంటే ఇవన్నీ పక్కన బెట్టి నడవాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో సమాజ శ్రేయస్సును కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తన నాయకత్వాన్ని బలపరుస్తూ కలిసి నడిస్తే సంతోషమన్నారు. లేదంటే నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకుంటానన్నారు. మరో రెండురోజుల్లో మరలా సమావేశమవుదామని, క్యాడర్ ప్రకటించే నిర్ణయంతో ముందుకు సాగుదామని ముగించారు.

పోలీసులకు ఎస్‌పి భరోసా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసు సిబ్బంది యొక్క శాఖా పరమైన సమస్యలపై సంక్షేమ దివాస్ ను పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి తుషార్ దూడి శుక్రవారం నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు,,విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది, ఏ.అర్ సిబ్బంది హెూమ్ గార్డ్స్ వారి యొక్క సమస్యలను ఎస్పీ తెలియ జేశారు. సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలిసికొని వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని సిబ్బందికి భరోసా కల్పించారు.

ట్రాక్టర్ పై నుంచి జారిపడి బాలుడి మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు

మృతుడు చందు

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పై నుంచి జారిపడి బాలుడు మృతి చెందాడు. వివరాల ప్రకారం ప్రతి ఏడాది ఈస్టర్ పర్వదినాన్ని పుర స్కరించుకుని పెదపరిమి నుంచి క్రైస్తవులు అనంతవరం కొండపైన ఉన్న మేరీమాత ఆలయం వరకు శిలువ యాత్ర నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా నిర్వహించారు. పెద పరిమికి చెందిన యర్రమాల చందు (14) శుక్రవారం ఈ ఆల యానికి వెళ్ళాడు. తిరిగి వచ్చే క్రమంలో ఓ ట్రాక్టర్ ఎక్కాడు. మార్గ మధ్యంలో నెక్కల్లు - అనంత వరం మధ్య ప్రమాద వశాత్తూ ట్రాక్టర్ పై నుంచి జారి కింద పడిపోవడంతో అతని తలకు బలమైన గాయమై అధిక రక్తస్రావం కావడంతో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిగ్నల్‌బోర్డు ఢీ కొట్టిన వాహనం..ఒకరి మృతి

ప్రజాశక్తి-నకరికల్లు

మృతుడు రామకోటేశ్వరరావు

సిగ్నల్ బోర్డును ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి తీవ్ర గాయాలై మృతి చెందిన సంఘటన చోటు చేసు కుంది. ఎస్సై పైడి రాం బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈపూరు మండలం గ్రామానికి చెందిన చింతల రామ కోటేశ్వరరావు (54) వ్యవసాయ పనులు చేసుకుంటూ ట్రాక్టర్ బాడుగకు తిప్పుతాడు. చేజర్ల గ్రామంలో ట్రాక్టర్ బాడుగ తాలూకా డబ్బులు రావాల్సి ఉండగా గురువారం రాత్రి వసూలు చేసుకుని వెళు తుండగా గ్రామ సమీపాన ఉన్న మురుగు కాలవద్ద సిగ్నల్ బోర్డు ఢీకొట్టడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం మతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లో పట్టపగలే చోరీ

బంగారం, నగదు అపహరించిన గుర్తుతెలియని వ్యక్తులు

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరులో పట్టపగలే చోరీ జరి గింది. రూ. 40 లక్షల విలువైన ఆభరణాలను అపహ రించారు. మండలం లోని సాతు లూరులో శుక్రవారం మధ్యాహ్నం 12 గం టల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమ యం చూసి గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉన్న సుమారు 500 గ్రాముల బంగారం, పదిహేను వేల రూపా యల నగదు అపహరించినట్లు యజమాని మాజేటి ప్రవీణ్ తెలిపారు. ప్రవీణ్ రైస్ మిల్లులో పార్టనర్. భార్య ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్. చోరీ ఘటన సమాచారం తెలుసుకున్న నాదెండ్ల పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

యుటిఎఫ్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన అప్పారి

వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో అప్పారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ

యుటిఎఫ్ అభివద్ధిలో కీలకపాత్ర పోషించిన అప్పారి వెంకటస్వామి జీవితాన్ని ప్రతి యుటిఎఫ్ ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకోవాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి అన్నారు. యుటిఎఫ్ సంఘ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఉపా ధ్యాయ ఉద్యమ నేత అప్పారి వెంకటస్వామి వర్ధంతి సభ పల్నాడు జిల్లా కేంద్రం నరస రావు పేటలోని అరండల్‌పేటలో గల యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వ హిం చారు. ఈ సభకు యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షత వహించారు.

అప్పారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం విజయ సారధి మాట్లాడుతూ యుటిఎఫ్ తక్కువ సభ్య త్వంతో ప్రారంభమై లక్ష సభ్యత్వాన్ని చేరు కోవడంలో అప్పారి కీలక పాత్ర పోషించా రన్నారు. సంఘ లక్ష్యాలకు అనుగుణంగా సంఘాన్ని తీర్చిదిద్దడంలో, కార్యకర్తలను తయారు చేసి సామాజిక కార్యకర్తలుగా మలచడంలో అప్పారి కృషి మరువలేనిదన్నారు. 25 ఏళ్లు సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, సంఘాన్ని ఉపాధ్యాయులకు అండగా నిలిచారన్నారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, విద్యా వికాసం కోసం అలు పెరగని పోరాటం చేసిన ఉద్యమ ఉపా ధ్యాయులు అప్పారి అని కొనియాడారు. అప్పారి ఆశయాలు కొనసాగించడమే ఆయన కిచ్చే నిజమైన నివాళి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేయడమే యుటిఎఫ్ ముందున్న కర్తవ్యమన్నారు. అప్పారి స్ఫూర్తితో బడి బయట పిల్లలను గుర్తించి బడుగు, బల హీన వర్గాలకు గుణాత్మక విద్య అందించేందుకు యుటిఎఫ్ కృషి చేయాలన్నారు. అమరజీవుల ఉద్యమ చరిత్రలు తెలుసుకొని వర్తమాన పరి స్థితులకు అనుగుణంగా పోరాటం చేయా లన్నారు. సంఘం ద్వారా పోరాడి సాధించు కొన్న హక్కులు కాపాడుకోవడమే కాకుండా కొత్త హక్కుల సాధన కోసం కషి చేయా లన్నారు. పాలక వర్గాలు ఉపాధ్యాయ ఉద్య మంపై ఉక్కు మోపుతున్నారని ఉద్యమాల ద్వారానే వాటిని త్రిప్పి కొట్టాలన్నారు. ఎందరో త్యాగధనులు సాదించిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు ఈ ఏడాది జరుపుకోవడం హర్షణీయమన్నారు.

కార్యక్రమంలోయుటిఎఫ్ జిల్లా సహా ధ్యక్షులు ఎం.మోహనరావు, సహాధ్యక్షు రాలు ఏ. భాగేశ్వరిదేవి, జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.కె. ఖాసింపీరా, జిల్లా బాద్యులు కె. రవిచంద్ర శేఖర్, వై. శ్రీనివాసరావు స్థానిక నాయకులు కె. వెంకటేశ్వరరావు, సత్యానంద్, సాయి పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	82,280
మిర్చి ఎగుమతి	:	91,650
మిర్చి నిల్వ	:	71,990

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 -19,500
నెం.5	8,500 - 16,000
273	9,000 - 20,000
341	9,000 - 18,000
4884	9,500 - 17,500
సూపర్ 10	8,500 - 14,000
	నాన్ ఎసి
తేజ	8,000 - 22,000
బడిగి	9,500 - 19,000
దేవనూరు డీలక్స్	9,000 - 16,000
తాలుకాయలు	5,000 - 12,000

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, TENALI
O.S. NO. 355/2022 in E.P. No. 183/2023
Between:
Bank of India, Nazarpet Branch,
Tenali rep. by its constituted attorney
Holder and Asst. General Manager
Zonal Office, Vijayawada ...Plaintiff
And
Shaik Rabbani, S/o. Jeelani,
Aged about 32 years, Occ: Goldsmith
D.No. 14-38-2, Matam Bazar, Morrispet,
Tenali. ....Defendant

NOTICE

పై నెంబరు దావాలో ఓ.యస్.నెం. 355/2022 ఇ.పి. నెం. 183/2023లో మీకు కోర్టు ద్వారాను, రిజిష్టర్డు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు చేయించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఆర్డరు వేస్తూ ది.05-04-2024న వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు అనగా ది.05-04-2024న ఉదయం గం.10.30 నిమిషములకు మీరు స్వయంగా గానీ, మీ తరుపున లాయరు గారి ద్వారా గానీ కోర్టు వారి ఎదుట హాజరై, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావా మరియు పైన తెల్పిన పిటీషనులో మీ పరోక్షమున విచారించి, తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా తేది : 05-04-2024
తెనాలి,
తేది : 20-03-2024. **గొరికపూడి బాబూరావు,**
వాది తరుపున న్యాయవాది, తెనాలి.
సెల్ నెం. 9440740044.

గ్రామపంచాయతీ కార్యాలయం, వడ్లమూడి
టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం. తేది : 20-3-2024

గుంటూరుజిల్లా, చేబ్రోలు మండలం, వడ్లమూడి గ్రామపంచాయతీలో టెండరు పద్ధతిపై ఈ దిగువ చూపబడిన పోస్టులలో పనిచేయుటకు ఒక సంవత్సర కాలమునకు అనగా ది. 1-4-2024 నుండి 31-3-2025 వరకు మాత్రమే సీల్డు టెండర్లు కోరటమైనది. సదరు టెండర్లను ది. 28-3-2024 ఉదయం 11 గం.ల వరకు మాత్రమే ఆఫీసు పనివేళల యందు టెండర్లను స్వీకరించబడును. ఈ దిగువ సంతకం చేసిన వారిచేగాని లేదా వారి అనుమతి పొందిన అధికారులచే గానీ స్వీకరించబడును. ది. 28-3-2024 తేదీ మధ్యాహ్నం 3-00 గం.లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో గ్రామపంచాయతీ కార్యదర్శి లేదా వారి అనుమతి పొందిన వారి సమక్షంలో టెండర్లు తెరువబడును. ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవలెను.

టెండరు వివరములు

వ. నెం.	టెండరు పోస్టు వివరం	టెండరు పోస్టుల సంఖ్య	టెండరు డిపాజిట్	కాలపరిమితి
1.	టెండరు స్వీపర్స్	17	100	1-4-2024 నుండి 31-3-2025 వరకు
2.	టెండర్ నీటి సరఫరా సిబ్బంది	4	100	1-4-2024 నుండి 31-3-2025 వరకు
3.	టెండర్ ట్రాక్టర్‌డ్రైవరు	1	100	1-4-2024 నుండి 31-3-2025 వరకు
4.	టెండర్ కరెంటు హెల్పర్స్	2	100	1-4-2024 నుండి 31-3-2025 వరకు
5.	టెండర్ కంప్యూటర్ ఆపరేటర్	1	100	1-4-2024 నుండి 31-3-2025 వరకు
6.	పిహెచ్.సామాన్లు కొనుగోలు		1000	1-4-2024 నుండి 31-3-2025 వరకు
7.	పిడబ్ల్యుఎస్ సామాన్లు కొనుగోలు		1000	1-4-2024 నుండి 31-3-2025 వరకు
8.	స్టేషనరీ సామాన్లు కొనుగోలు		1000	1-4-2024 నుండి 31-3-2025 వరకు
9.	ఎలక్ట్రికల్ సామానుల కొనుగోలు		1000	1-4-2024 నుండి 31-3-2025 వరకు

సం/- వై.పి.ఎ. ప్రసాద్,
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, వడ్లమూడి

IN THE COURT OF THE HON'BLE MACT AND XI ADDL. CHIEF JUDGE CITY CIVIL COURTS:: AT: HYDERABAD
I.A No 2527 of 2023
IN
O.P. No. 2269 OF 2019
BETWEEN:
M/S. BAJAJ ALLIANZ GENERAL INSURANCE COMPANY LTD
.. Petitioner/Respondent No.3
AND
GUNTAPALLI SIVALAKSHMI & Others
...Petitioner/Respondents.

SUMMONS TO PROPOSED RESPONDENTIRESPONDENT_No.6 UNDER ORDER V. RULE -20 R/W. SEC.151 OF CPC

TO
Rupana Kasi Viswanadham, S/o. Pullaiah, R/o. 3-144/3,Chilakallu, Jaggaiahpeta, Krishna District, Andhra Pradesh.

PLEASE TAKE NOTICE that the above named petitioner/Respondent insurance company filed the above application against you and the Hon'ble Court adjourned the matter to 03-04-2024 for your appearance. Please be present before the above named Hon'ble Court on 03-04-2024 at 10:30 A.M,fiilling which the matter shall be decided in your absence and based upon merits.

(BY ORDER OF THE HON'BLE COURT)
VINOD VUDUTHA
(TS/2049/2002)
Advocate
Counsel for Petitioner/Respondent No 3.
H.No. 4-87, Plot No. 224,Flat No. G-1,
Sri Datta Sai Residency,Budhanagar,
Boduppal, Hyderabad-092.
vinodvudutha@gmail.com (Cont. No.: 9490 007 506)

అరవిందబాబుకే మళ్లీ సీటు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బీసీ సామాజిక తరగతి ఓట్లు అధికంగా ఉండడం, ఐదేళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని కార్యక్రమాలు నిర్వహించడం, అంతర్గత సర్వేలోనూ అరవిందబాబుకే ఎక్కువ మంది మద్దతు తెలపడం తదితర కారణాల నేపథ్యంలో నరసరావుపేట అసెంబ్లీ టిడిపి అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబును ఆ పార్టీ ఖరారు చేసింది. ఇదే క్రమంలో పార్లమెంటు అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలును నిర్ణయించారు శుక్రవారం టిడిపి 3వ జాబితాలో 11 అసెంబ్లీ, 13 పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల జాబితాలో నరసరావుపేట, అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థుల పేర్లను విడుదల చేసింది. కొంతకాలంగా నరసరావుపేట అసెంబ్లీ సీటుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పల్నాడు జిల్లా కేంద్రమైన, కీలకమైన నరసరావుపేట సీటు కోసం దాదాపు 10 మందికి పైగా అభ్యర్థులు పోటీపడ్డారు. టిడిపి ప్రకటించిన మొదటి రెండు జాబితాల్లో నరసరావుపేట లేకపోవడంతో ఆశావాహుల్లో ఆందోళన మొదలైంది. దీనికి తెరదించుతూ తాజా జాబితాలో అరవిందబాబును ఖరారు చేశారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు టిడిపి కార్యాలయానికి పెద్దఎత్తున చేరుకొని సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. నరసరావుపేట పార్లమెంటు పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలున్నాయి. పార్లమెంటు స్థానాన్ని కమ్మ సామాజిక తరగతికి చెందిన లావు శ్రీకృష్ణదేవరాయలుకు కేటాయించారు. అసెంబ్లీ స్థానాల్లో నాలుగు స్థానాలను కమ్మ సామాజిక తరగతికి చేటాయించగా రెడ్డి, కాపు, బీసీ సామాజిక తరగుతులకు ఒక్కోటి చొప్పున టిడిపి కేటాయించింది. గత ఎన్నికల్లో వైసిపి తరుపున గెలిచిన శ్రీకృష్ణదేవరాయలు ఈసారి టిడిపి తరుపున పోటీలో ఉన్నారు. ఆయన్ను తొలుత గుంటూరు నుండి పోటీ చేయాలని వైసిపి అధిష్టానం ఆదేశించగా అందుకు అయన నిరాకరించి నరసరావుపేటపైన పట్టుబట్టారు. అయితే వైసిపి అందుకు అంగీకరించకపోవడంతో శ్రీకృష్ణదేవరాయలు ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరగా ఆయనకు టిక్కెట్‌ను టిడిపి ఖరారు చేసింది.

ఈ సీటు గెలిచి 20 ఏళ్లు

టిడిపి ఆవిర్భావం నాటి నుండి నరసరావుపేట అసెంబ్లీ సీటు టిడిపికి కంచుకోటగా మారింది. డాక్టర్ కోడెల శివప్రసాద్ నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా 1983 నుంచి 1999 ఎన్నికల వరకు వరుసగా 5 సార్లు గెలిచారు. ఆ తరువాత 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాసు వెంకట కృష్ణారెడ్డి చేతిలో కోడెల ఓటమి చెందారు. 2014లో టిడిపి, బిజెపి, జనసేన కూటమిగా ఏర్పడటంతో నరసరావుపేట సీటును బిజెపి తరుపున నల్లబోతు వెంకట్రావుకు కేటాయించారు. ఆయనపై వైసిపి అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 16 వేల మెజార్టీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన టిడిపి నరసరావుపేట సీటును డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు కేటాయించింది. అప్పుడూ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 32 వేల మెజార్టీతో గెలిచారు. అప్పటి నుండి అరవిందబాబును నియోజకవర్గం టిడిపి ఇన్చార్జిగా వ్యవహరిస్తూ పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ అసెంబ్లీ స్థానం నుండి 20 ఏళ్లుగా గెలుపు కోసం ఎదురు చూస్తున్న టిడిపికి ఈ సారైనా సానుకూల ఫలితాలుంటాయేమోనని శ్రేణులు భావిస్తున్నాయి.

అరవిందబాబుకు స్వీట్లు పెడుతున్న టిడిపి శ్రేణులు

అరవిందబాబు ఏమన్నారు..?

బీసీల సంక్షేమం, అభ్యున్నతికి తోడ్పడిన పార్టీ టిడిపి అని డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ తన పేరును ప్రకటించినందుకు చంద్రబాబు, లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలంతా ఏకమై రాజ్యాధికారం వైపు అడుగులు వేస్తున్నారంటే అందుకు కారణం టిడిపి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను జగన్‌మోహన్‌రెడ్డి ఓటు బ్యాంకుగానే చూస్తూ మోసం చేస్తున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను ఓడించి తీరుతామని చెప్పారు.

వినుకొండ వాసికి ఉత్తమ పరిశోధన అవార్డు

ప్రజాశక్తి - వినుకొండ

అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ పరిశోధన అవార్డును వినుకొండ వాసు అందుకున్నారు. తమిళనాడులోని తిరుచ్చిలో అంతర్జాతీయ కాంగ్రెస్ ఫర్ రీఛార్జ్ ఎక్సలెన్స్ (ఆసియా రీఛార్జ్ అవార్డు) ప్రదానోత్సవంలో డాక్టర్ ఎస్కే అల్తాఫ్ హుస్సేన్ బాష 'కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్' విభాగంలో అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం డాక్టర్ ఎస్కె అల్తాఫ్ హుస్సేన్ బాష.. కృష్ణచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సెన్సెస్ మార్కాపురంలో ప్రొఫెసర్ పనిచేస్తున్నారు. ఆయనకు కళాశాల సెక్రెటరీ కృష్ణ చైతన్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

బాబు, పవన్ ఇద్దరూ మోడీని తిట్టిన వారే

ప్రజాశక్తి - వినుకొండ : చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఇద్దరు నరేంద్ర మోడీని తిట్టినవారేనని, అయితే ఇప్పుడు పదవుల కోసం పొగుడుతున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎద్దేవ చేశారు. పట్టణంలోని 28వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ప్రతిపక్షాలు చెప్పే అబద్ధాలను నమ్మొద్దని, వినుకొండలో తాను చేసిన అభివృద్ధిని గుర్తించాలని కోరారు. మరింత అభివృద్ధి కోసం తనకు మద్దతుగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే కుమారుడు గిరిబాబు, వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

రూ.10 వేల పైన వస్తువులకు బిల్లులుండాల్సిందే

ప్రజాశక్తి-ఈపూరు : ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలన్నీ తీసుకుం టున్నట్లు వినుకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పులిచింతల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 85 ఏళ్లు పైబడిన వారు, 40 శాతం అంగవైకల్యం ఉన్నవారు, కోవిడ్ బారిన పడి ఆరోగ్యం క్షీణించిన వారి వద్ద నుండి ధ్రువపత్రాల ఆధారంగా ఫారం-12 దరఖాస్తు ద్వారా వారి అనుమతితో సార్వత్రిక ఎన్నికలకు ఐదు రోజులు ముందే ఓటు వేయించటం జరుగుతుందన్నారు. అవసరమైన వారి కోసం ప్రభుత్వ హనాలను ఏర్పాటు చేస్తామన్నారు. రూ.10 వేలు పైన కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించి కచ్చితంగా బిల్లులు ఉండాలని, రూ.50 వేలు పైన నగదు రవాణా చేసేవారు ఆధారాలు చూపించాలని చెప్పారు. రూ.10 లక్షలకు పైన నగదు రవాణా చేస్తే సీజ్ చేస్తామని, వాటిని మళ్లీ పొందాలంటే ఆధారాలతో జిల్లా స్థాయిలో గ్రీవెన్స్‌లో అప్పీలు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ మండల అధికారిగా ఎంపీడీవో ఏవీ రంగనాయకులు ఉంటారని, ఎన్నికల పర్యవేక్షణకు సెక్టోరి యల్ అధికారులుగా మండలస్థాయి అధికారుల ఐదుగురిని నియమించామని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు పనిలో ఉంటాయన్నారు. మండలంలోని 46 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు. 18 ఏళు నిండిన వారు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ప్రచారం కోసం రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరి అన్నారు. సమావేశంలో తహశీల్దార్ బి.దిలీప్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్ పాల్గొన్నారు.

పల్నాడు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, నోడల్ అధికారులు

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల సన్నద్ధత, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి శుక్రవారం సమీక్షించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్ నుండి కలెక్టర్ ఎల్.శివశంకర్, నోడల్ అధికారులు వీసీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల దష్ట్యా జిల్లాలో పకడ్బందీగా మోడల్ కోడ్ ఆఫ్ కండెక్టు అమలు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై క్షేత్రస్థాయిలో నిత్యం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి విషయమై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గురజాలకు అదనంగా సూపర్ సిక్స్ పథకాలు : యరపతినేని

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

బాబు సూపర్ సిక్స్ పథకాలకు అనుగుణంగా గురజాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా మరో సూపర్ 6 పథకాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ప్రకటించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగిన పల్నాడు జిల్లాకు గురజాల నియోజకవర్గం కేంద్రంగా ఏర్పాటుకు కృషి చేస్తామని, నియోజకవర్గంలో జాబ్‌మేళా ద్వారా 15 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందించి పరిశ్రమలు ఏర్పాటుకు చేయూతనిస్తామని చెప్పారు. బాబు సూపర్ సిక్స్ పథకాల్లో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తుండగా గురజాల నియోజకవర్గంలో ప్రత్యేకంగా మరొక గ్యాస్ సిలిండర్ ఏర్పాటు చేస్తానన్నారు. నియోజకవర్గం నుంచి హజ్ యాత్రకు వెళ్లే ప్రతి

ముస్లిముకు రూ.లక్ష ఇస్తామన్నారు. వేలంగిణి, నాగార్జునసాగర్, గుణదలకు వెళ్లే క్రైస్తవులకు ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో లక్షమందికిపైగా చంద్రన్న బీమా పథకాన్ని సొంత నిధులతో ప్రీమియం చెల్లించి పత్రాలిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో దోపిడీ దాడులు దౌర్జన్యం పెరిగిందని, టిడిపి-జనసనే కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. 2019 నుండి గురజాల నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలపై అనేక దాడులు జరిగాయని, 11 మందిని హత్య చేశారని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అక్రమ మైనింగ్, ధన దాహానికి 8 మంది చిన్నారులు చనిపోయారని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కార్మికుడా నీకు శతకోటి వందనాలు...



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలని అధికారులు నిత్యం ప్రచారం చేస్తూనే ఉంటారు. కానీ అందుకు పాటుపడే కార్మికుల శ్రమను ఎవరూ గుర్తించరు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ పనులను పర్యవేక్షించాల్సి వస్తే అధికారులతో పాటు ఆ మార్గంలో వెళ్లే ప్రజలు సైతం తమ ముఖ ఖవళికలను మార్చుకుంటారు. కళ్లు తిప్పుకోవడం, దుర్వాసనతో వచే గాలిని ఊపిరి పీల్చుకోకుండా బిగపట్టడం చేస్తుంటారు. అంతటి దుర్గంధంలో అంతటి ప్రమాదకర పరిస్థితుల్లో కార్మికులు పని చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత కోసం తమ ఆరోగ్యాన్ని, చివరికి తమ ప్రాణాలనూ పణంగా పెడుతున్నారు. ఆ విధుల్లో ఉన్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల శ్రమను ప్రజాశక్తి ఇలా తన కెమెరాలో బంధించింది. కార్మికులు అంత చేస్తున్నా వారికి దక్కే జీతాలతో పూట గడవడం కష్టమవుతోంది. బతుకులు భారంగా ఉన్నాయని, కనీస వేతనాలు చెల్లించాలని తరచూ రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. వారికి గుర్తింపు, గౌరవం రెండూ కరువే.

రాష్ట్రానికి అన్యాయం చేసిన ఎన్‌డిఎ కూటమి, వైసిపిని ఓడించండి

సిపిఎం విస్తృత సమావేశంలో పాశం రామారావు

ప్రజాశక్తి మంగళగిరి :రాష్ట్రానికి అన్యాయం చేసే ఎన్ డి ఏ కూటమిని, వైఎస్ఆర్సిపి అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సిపిఎం మంగళగిరి పట్టణ సభ్యులు, సానుభూతిపరుల విస్తృత సమావేశం వివి జవహర్లాల్ అధ్యక్షతన జరిగింది. రామారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గత పది సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పరిపాలించిన వైసీపీ, టిడిపి పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కన్నా వారి వ్యక్తిగత ప్రయోజ నాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ ఎన్నికల జరుగుతున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులను, నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకున్న హక్కులన్నీ మోడీ ప్రభుత్వం కాల రాస్తుందని విమర్శించారు. ఈసారి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడితే భవిష్యత్తులో ఎన్నికలు జరిగే అవకాశం ఉండద న్నారు. అందుకు ప్రధాని మోడీ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని అన్నారు. సిపిఎం మంగళగిరి నియోజకవర్గం లో అనేక ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నామని అన్నారు. ప్రజా పోరాటాల ఉద్యమాలుగా చేస్తున్న ఇండియా వేదిక అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులు మరలా పూర్వ వైభవం తీసుకురావడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. నిర్మల విద్యాసంస్థల డైరెక్టర్ వివి

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు, వేదికపైన జొన్నా శివశంకరరావు తదితరులు

ప్రసాద్ మాట్లాడుతూ కమ్యూనిస్టుల కంచుకోట మంగళగిరి నియోజకవర్గం అని అన్నారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో కమ్యూనిస్టు అభ్యర్థులు నాలుగుసార్లు విజయం సాధించారని అన్నారు. కమ్యూనిస్టులు గా దర్శి లక్ష్మయ్య 20,000 ఓట్ల మెజార్టీతో గెలవడం జరిగిందని అన్నారు. ఆ తర్వాత సిపిఎం అభ్యర్థిగా నిమ్మగడ్డ రామ్మోహన్ రావు 17,000 మెజార్టీతో విజయం సాధించడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జె వ రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, పట్టణ కార్యదర్శి వరకు సభ్యులు ఎం బాలాజీ, ఎస్ ఎల్ ఎం చైతన్య హై స్కూల్ డైరెక్టర్ ఎస్ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

విలీన గ్రామాల కార్మికుల జీతాలు పెంచాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : సిఆర్‌డిఎలో విలీనమైన గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచాలని మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్-ఎస్ చెంగయ్య కోరారు. శుక్రవారం తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు తమ డిమాండ్ల సాధన కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ సమ్మె కాలపు జీతాలు కూడా ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి పండుగ సంద ర్భంగా వెయ్యి రూపాయల అలవెన్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. పట్టణంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని, చెప్పులు, సబ్బులు, నూనెలు, యూనిఫారం సంవత్సరన్నరగా ఇవ్వడంలేదని, వెంటనే ఇవ్వాలని కోరారు. రక్షణ పరికరాలు ఇవ్వకుండా కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఆదివారం పండుగ సెలవు దినాల్లో ప్రత్యేక సెలవులు ఇవ్వాలని కోరారు. విలీన గ్రామాల్లోని కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, పట్టణాల్లోని కార్మికుల పిఎఫ్ నాలుగు నెంబరు సరి చేసి ఒకే నెంబర్‌కు మార్చాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచడంతో పాటు క్లాప్ ఆటోడ్రైవర్లకు కూడా జీతాలు పెంచాలన్నారు. సమాన పనికి సమాన వేతనంలో భాగంగా బదిలీ కార్మికులకు కూడా రూ.21 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాజధాని అధ్యక్షులు ఎం.రవి, యూనియన్ మంగళగిరి టౌన్ అధ్యక్ష కార్యదర్శులు వై.కమలాకర్, బాలాజీ, నాయకులు టి.పార్వతి, డేవిడ్‌రాజు, వెంగమ్మ పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా భగత్‌సింగ్ వర్ధంతి సభలు

ప్రజాశక్తి-గుంటూరు

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నేడు జిల్లా, మండల కేంద్రాల్లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సభలు పెద్ద ఎత్తున నిర్వహించాలని రైతు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడీపేటలోని పిఎల్‌రావు భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో సహజ వనరుల్ని దోచుకుంటూ, ప్రజలను హింసించిన బ్రిటీషు పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో యువకులుగా సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవులు ప్రాణత్యాగం చేశారన్నారు.నేడు బిజెపి ప్రభుత్వం కూడా దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతుందన్నారు. ఢిల్లీలో జరుగుతున్న రెండో దఫా రైతు పోరాటం నేపథ్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడాలని

మాట్లాడుతున్న నాయకులు

పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ, ఏఐకెఎస్ జిల్లా కార్యదర్శి పి.శివాజీ, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, ఎపి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి యు.నాగేశ్వరరావు, జాతీయ రైతు కూలీ సంఘం నాయకులు వేల్పూరి నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈ.అప్పారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.విఠల్ రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధంలో పరిపూర్ణత

రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మనిషి జీవిత పరిపూర్ణతకు బౌద్ధమతం దోహద పడుతుందని రెక్టార్ ఆచార్య పి వరప్రసాద్ మూర్తి అన్నారు. విశ్వవిద్యాలయంలోని బుద్ధిజం విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న గ్లోబల్ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముగింపుసభలో రెక్టార్ మాట్లాడుతూ మనిషి ఆలోచనలకు కాలక్రమేణా వస్తున్న మార్పులకు బౌద్ధంలో సమాధానాలు దొరుకుతా యన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎల్. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ మూడు రోజుల గ్లోబల్ సదస్సులో 100కు పైగా పరిశోధన పత్రాలు వచ్చాయని, 18 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారన్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రొఫెసర్ రమేష్ కుమార్ మిశ్రా బౌద్ధం జ్ఞానపరమైన విజ్ఞానం అనే అంశంపై

మాట్లాడారు. సదస్సులో పాల్గొన్న పరిశోధకులకు విదేశీయులకు రెక్టార్ వరప్రసాద మూర్తి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చివరి రోజు మయన్మార్, జపాన్ దేశాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆచార్య ఉదయ్ కుమార్ తెలిపారు. వీటి ద్వారా రెండు దేశాలతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బుద్దిస్ట్ స్టడీస్ విభాగం పరిశోధన రంగాలలో పరస్పరం సహ కారం అందించుకునే వీలు కలుగుతుందన్నారు. ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ సమక్షంలో జరిగిన ఒప్పందంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేకుంటే కొత్తపార్టీ ఆలోచన

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన

ప్రజాశక్తి-తెనాలి

బీసీలను అణగదొక్కాలని చూసినా, మభ్యపెట్టాలని చూసిన ఏ రాజకీయ పార్టీ అయినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని బృందావన్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన చేయిస్తామని ప్రకటిస్తే దానిని జీర్ణించుకోలేని సిడబ్ల్యూసి సభ్యులు ఆనంద్‌శర్మ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. దానిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. రిజర్వేషన్ ప్రయోజనాలు ఏ వర్గానికి ఏ మేరకు అందుతున్నాయో తెలుసుకుని, వాటిని కొనసాగింపుకు కులగణన ఉప యోగపడుతుందన్న విషయాన్ని ఆనందశర్మ వంటి నాయకులు తెలుసుకోవాలన్నారు. బిపి మండల్ కమిషన్, కాకాలే కమిషన్ కులగణను చేయాలని చేసిన సిఫారసులను మరిచిపోయారా అంటూ ఆనందశర్మను ప్రశ్నించారు. 2014లో ఎన్డీయే కులగణన చేస్తామని హామీయిచ్చి అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నేదు రాహుల్ గాంధీ ఎంతో దూరదృష్టితో కులగణనకు ప్రకటన చేస్తే అనందశర్మ వంటి నాయకులు

మాట్లాడుతున్న కేశన శంకరరావు

కుట్రలు చేయటం మానుకోవాలని, లేకుంటే ఓటమి తప్పదని హెచ్చరించారు. దేశంలో 542 ఎంపీ స్థానాల్లో 275 స్థానాలు కేటాయించాల్సి ఉందని, అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 296 అసెంబ్లీ స్థానాల్లో 150 స్థానాలు జనాభా దామాషా ప్రకారం బిసిలకు దక్కాల్సి ఉందని, దానికి భిన్నంగా నామమాత్రపు కేటాయింపులతో సరిపెడు తున్నారన్నారు. ఈ పరిణామాలు తిప్పికొట్టేందుకు బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సమైక్యతతో నూతన పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు జె.వెంకటేశ్వరరావు, వేముల కృష్ణ, కె.శ్రీనివాసరావు, మురళి, రమేష్‌బాబు, సాయి, మణికంత, వి.సాయిరామ్ పాల్గొన్నారు.

అంజుమన్ సంస్థ ట్రస్ట్ బోర్డు సభ్యులతో లోకేష్

రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకున్న జగన్

పలువురితో లోకేష్, చంద్రశేఖర్ సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో పలువురిని శుక్రవారం ఉదయం మంగళగిరి అసెంబ్లీ టిడిపి అభ్యర్థి నారా లోకేష్, గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ కలిశారు. పట్నంలోని పివిపిఎల్ అపార్ట్మెంట్ వాసులతో, టిప్పర్ల బజార్లో షేక్ ఇస్మాయిల్ తదితర మైనార్టీ నాయకులను కలిశారు. పాత బస్టాండ్ సెంటర్లో గల అంజన సంస్థ కార్యాలయంలో అంజన ట్రస్ట్ పోర్ట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ జగన్ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. అభివృద్ధి జరగాలంటే తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టిడిపి సీటు కేటాయించలేదని నిరసన

రాష్ట్రంలో 11శాతం పద్మశాలీలున్నారని ఆగ్రహం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో పద్మశాలీలు 11 శాతం ఉన్నారని, టిడిపి మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడా సీటు కేటాయించలేదని టిడిపి నాయకులు దామర్ల మోహన్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నివాసంలో నిరసన వ్యక్తం చేశారు. కనీసం చీరాల సీట్ అయినా ఇస్తారని ఎదురు చూశామని అది కూడా కేటాయించకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తున్నామని అన్నారు. రెండు రోజుల్లో పద్మశాలీల సంఘాలతో చర్చించి ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు.

జై భారత్ నేషనల్ పార్టీ పొన్నూరు

నియోజకవర్గ సమన్వయకర్తగా రోశయ్య

ప్రజాశక్తి - చేబ్రోలు

జై భారత్ నేషనల్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయ కర్తగా మాదిగ మహా జన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వరికూటి రోశయ్య నియ మితులయ్యారు. ఆ పార్టీ అధ్యక్షులు వివి లక్ష్మీ నారాయణ సంస్థాగత నియామక పత్రాన్ని శుక్రవారం రోశయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతు పార్టీ బలోపేతానికి, క్షేత్రస్థాయిలో ప్రజల్లో పనిచేస్తూ, నియోజకవవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

గుంటూరులో మాధవి, చంద్రశేఖర్ ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి స్థానిక వేళంగణి నగర్‌లో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గళ్లా మాధవి మాట్లాడుతూ 49 వ డివిజన్ లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గం ఇన్ చార్జి కోవెలమూడి రవీంద్ర (నాని), టిడిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకుడు మద్దిరాల మ్యానీ, బిజెపి నాయకులు చందు సాంబశివరావు, టిడిపి నాయకురాలు దాసరి జ్యోతి, టిడిపి 49 వ వార్డు అధ్యక్షుడు తలకతోటు సుధీర్ , సాలిమిట్టు మార్కు, దాసరి శంకర్,దాసరి సతీష్ , పెండెం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్ రద్దు

- 'ప్రజాశక్తి'తో ఎడిఎ పి.మస్తానమ్మ
- తరచుగా తనిఖీలు చేస్తాం
- నిబంధనలు అతిక్రమించినా యూరియా కొరత సృష్టించినా కఠిన చర్యలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఎరువులు, పురుగుమందుల దుకాణాదారులు అధిక ధరలకు విక్రయించినా, నకిలీ గుర్తింపు లేని పురుగు మందులు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎడిఎ పి.మస్తానమ్మ హెచ్చరించారు. ఇటీవల గుర్తింపులేని బయో ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి శనివారం ప్రజాశక్తితో ప్రత్యేకంగా ఆమె మాట్లాడారు. గుర్తింపులేని పురుగుమందులు, బయోమందులను అరికట్టేందుకు తరచు దుకాణాలలో తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. ముద్రణ ధరకు మించి పురుగు మందులు విక్రయించినా, నిబంధనలు అతిక్రమించినా దుకాణాల లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు తమ పరిధిలోని పురుగుమందుల దుకాణాలలో అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలలో సైతం తనిఖీ చేస్తామన్నారు. రైతులకు విక్రయించే పురుగు మందుల క్రయ విక్రయాలలో దుకాణ యజమానులు అప్రమత్తంగా వ్యవహరించకపోతే దుకాణ అనుమతులు రద్దు చేస్తామన్నారు. ప్రతి దుకాణంలో పరిమాణం, అమ్మకపు ధరలు నిల్వలకు సంబంధించిన వివరాలు దుకాణంలో ఏర్పాటు చేసిన నల్లబోర్డుపై బహిరంగంగా ప్రదర్శించాలన్నారు. బోర్డుపై నమోదు చేసిన వివరాలకు, రికార్డులో ఉన్న నిల్వలకు, వాస్తవ నిల్వలకు వ్యత్యాసం ఉంటే చర్యలు తప్పవన్నారు. రైతు కొనుగోలు చేసిన ప్రతి మందుకు వారికి బిల్లు ఇవ్వాలని, రైతులు మోసపోయినట్లు ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

పురుగు మందుల దుకాణాలలో తనిఖీ చేస్తున్న ఎడిఎ పి.మస్తానమ్మ (ఫైల్)

కృతిమ కొరత సృష్టించొద్దు

జిల్లాలో యూరియా కొరత లేదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎడిఎ హెచ్చరించారు. జిల్లాలో రైతులకు అవసరమైన యూరియాతో పాటు, అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ప్రైవేటు డీలర్ల వద్ద, రైతు భరోసా కేంద్రాల్లోనూ యూరియా అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేటు డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, నిర్ణీత ధర కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు. యూరియా కొరత లేదని, యూరియా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతుల ఆధార్ వివరాలను నమోదు చేయకుండా ఎరువుల విక్రయాలు చేపట్టరాదని ఎడిఎ ఆదేశించారు.

మాచర్లలో ఎన్నికల సన్నద్ధతపై నేడు సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేటి మధ్యాహ్నం (శనివారం) పల్నాడు జిల్లా మాచర్ల పట్టణ పురపాలక సంఘ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి ఎన్నికల సన్నద్ధత , శాంతిభద్రతలపై జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ (మాచర్ల నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి)తో కలిసి సమీక్ష నిర్వ హించనున్నారు. ఇంటిగ్రేటెడ్/ బోర్డర్/ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టుల ప్రతినిధులు, ఎన్నికల సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వ హించనున్నట్లు శుక్రవారం కలెక్టరేట్ నుండి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలను స్వీక రించడానికి మాచర్ల నియోజకవర్గ పార్టీ ప్రతినిధులు/ప్రజలకు కలెక్టర్,జాయింట్ కలెక్టర్, డిఎస్పీ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

రైల్వే ఉద్యోగాలపై ఉచిత కోచింగ్ తరగతులు

ప్రజాశక్తి - వినుకొండ

రైల్వే ఉద్యోగాలు (అసిస్టెంట్ లోకో పైలట్, గ్రేడ్ టెక్నీషియన్, ఆర్‌పిఎఫ్, ఆర్‌ఆర్‌బి –గ్రూప్ 'డి', ఇతర పోటీ పరీక్షలు)కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శ్రీబాలాజీ ఐ.టి.ఐ. కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళా శాల ప్రిన్సిపల్ కర్రీ వెంకట్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24న ఉదయం 10 గంటలకు కళాశాలలో జరగనున్న ఉచిత అవగాహన సదస్సు, ఉచిత కోచింగ్ తరగతుల ఎంపిక ప్రక్రియకు హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన వారికి మాత్రమే ఈ నెల 25 నుండి ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభమవుతాయని, వివరాల కోసం 7702892288, 834182 1710, 944054 2030 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

జనసేన నాయకులపై దాడికి ఖండన

ప్రజాశక్తి-మాచర్ల

దుర్గి మండలంలో జనసేన నాయకులపై జరిగిన దాడిని తమ పార్టీ ఖండిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర నాయకులు గుమ్మడి కోటేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ దాడులకు పాల్పడిన వారిని వెంటనే ఆరెస్టు చేయాలన్నారు.

శాలివాహన జయంతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక అంబేద్కర్ భవన్ లో శుక్రవారం శాలివాహన ప్రజా పతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం హాజరయ్యారు. తొలుత భాస్కర్ థియేటర్ సెంటర్‌లోని శాలివాహన విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. స్వీట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎన్. హనుమంతరావు, గౌరవాధ్యక్షులు ఎం.నాగబాబు, కోమరవల్లిపాడు కో ఆపరేటివ్ సొసైటి అధ్యక్షులు కె.ఆంజ నేయులు, కోటప్పకొండ అన్నదాన సత్రం అధ్యక్షులు డి.రంగయ్య, పి.సుబ్బయ్య, ఎన్. వీరనారాయణబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు కచ్చితంగా ఉండాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

గ్రామానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు కచ్చితంగా ఉండాలని జిపిడిపి ప్లానింగ్ సిఆర్ పి దయాసాగర్ అన్నారు. పెదకూరపాడు లోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు ఎండిఓ మల్లేశ్వరి అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. దయాసాగర్ మాట్లాడుతూ గతంలో అందించిన ప్రణాళికలను కూడా ప్రస్తుతం సవరించుకోవచ్చని చెప్పారు. పెదకూరపాడు ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యాపారులూ తీసుకోండి .. వినియోగదారులకు ఇవ్వండి

- రూ.10 నాణేలు చలమణిలోనే ఉన్నాయి
- పాత వంద రూపాయలు కూడా
- ఎస్‌బిఐ మేనేజర్ ఎస్.క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల

పాత వంద రూపాయల నోటు, రూ.10 నాణేలు చలా మణిలోనే ఉన్నాయని ఎస్‌బిఐ మాచర్ల శాఖ బ్యాంక్ మేనేజర్ ఎస్.క్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రూ.10 నాణేలు, పాత వంద రూపాయల నోటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిషేధించలేదని, వీటిపై అనవసర వదంతులను నమ్మొద్దని వ్యాపారులకు, ప్రజలకు సూచించారు. ప్రజలు తమ లావాదేవిలలో రూ.10 నాణేలు, రూ 100 పాత నోట్లను వినియోగించవచ్చని చెప్పారు. తెలిపారు. రూ.10, రూ. 20 నోట్ల సరఫరా తక్కువగా ఉందని చెప్పారు. ఇప్పటికీ బ్యాంకుల్లో, ఆర్‌టిసి, రైల్వే, ప్రభుత్వ సంస్థలలో ఎక్కడ కూడా రూ.10 నాణేలను తీసుకోమని చెప్పడం లేదని అన్నారు. వ్యాపారులు, ప్రజలు రూ.10, రూ.20 నాణేలను విని యోగిస్తేనే లావాదేవిలు సులభ తరమవుతాయని సూచించారు. సమావేశంలో అకౌంట్ ఆఫీసర్ బిక్యానాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేనేజర్ ఎస్.క్రిష్ణారెడ్డి, ఆఫీసర్ బిక్యానాయక్

వాహన యాజమానికి రూ 1లక్ష ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న వైసిపి నేత పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

8వ వార్డులో వాహనాన్ని తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

ప్రజాశక్తి-మాచర్ల

స్థానిక 8వ వార్డులో సెంట్రింగ్ చెక్క, కాంక్రీట్ మిషన్లు సరఫరా చేసే మేస్త్రీ బండారు వెంకటరావుకు చెందిన బోలేరో వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత తగలబెట్టారు. టైరు పేలిన శబ్దంతో నిద్ర మేలు కున్న స్థానికులు సమీపంలో ఉండే వాహన యాజ మానికి తెలియజేసి వాహనం పూర్తిగా దహనం కాకుండా అడ్డుకున్నారు. వెంకటరావు విలేకరులతో మాట్లా డుతూ తాను ఏ పార్టీకి చెందిన వాడిని కాదన్నారు. ఎవరు తగలబెట్టారో తెలియదన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా,వాహన యాజమానికి వైసిపి నేత పిన్నెల్లి వెంకటరామిరెడ్డి రూ 1లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు.

'చదలవాడకు అండగా ఉంటాం'

ప్రజాశక్తి-నరసరావుపేట

తెలుగుదేశం పార్టీ అధిష్టానం శుక్రవారం విడుదల చేసిన 3వ జాబితాలో నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో అరవిందబాబుకు అండగా ఉంటామని టిడిపి డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు, కడియాల హాస్పిటల్ అధినేత డాక్టర్ కడియాల వెంకటేశ్వంరావు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెనిగండ్ల మధుసూదనరావు, డాక్టర్ పువ్వాడ సూర్య నారాయణ, డాక్టర్ నాగోతు ప్రకాష్ డాక్టర్ కడియాల లలిత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అరవిందబాబుతో వైద్యులు కడియాల, నాగోతు, పువ్వాడ తదితరులు

విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం అన్నదానం

ప్రజాశక్తి - వినుకొండ

విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం వారి ఆధ్వర్యంలో శుక్ర వారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం భవనం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమం సందర్భంగా భువన గిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సేవా సం ఘం ఆధ్వర్యంలో గత పదేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అన్నదాన కార్య క్రమం నిర్వహించినట్లు చెప్పారు. అన్నదానానికి సహకరించిన నాగేశ్వరరావును ఈ సందర్భంగా అభి నందించారు. కార్యక్రమంలో ఎ.రామ లింగేశ్వర రావు, ఎ.కోటేశ్వరరావు, జి. నాగేంద్రుడు, వైవి సుబ్బయ్య శర్మ, పి.నారాయణరావు, వి. హనుమంతరావు, కృష్ణమూర్తి, ఎంవి శర్మ, వి.హనుమంతరావు పాల్గొన్నారు.

మొబైల్ వాహనంతో ఉచిత మినరల్ కూలింగ్ వాటర్

ప్రజాశక్తి-మాచర్ల

పట్టణంలో మొబైల్ వాహనం ద్వారా శుక్రవారం నుండి ఉచితంగా మినరల్ కూలింగ్ వాటర్ పంపిణి కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీరామ క్రిష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మాచర్ల టౌన్, ఇతర ప్రాంతాలలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ఉచితంగా కూలింగ్‌తో మినరల్ వాటర్‌ను మొబైల్ వాహనం ద్వారా పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి సెంటర్‌లో ఒక గంట సేపు వాహనాన్ని నిలిపి చల్లటి మంచినీటిని ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు రహదారులపై ఉండే నిరుపేదలకు అన్న ప్రసాద వితరణను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పోలిశెట్టి పుల్లారావు, వెంకటేశ్వరరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించిన జేసీ

ప్రజాశక్తి - మంగళగిరి : ఈవియం లను భద్ర పరుచుటకు స్ట్రాంగ్ రూమ్‌లను శుక్రవారం మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జి రాజకుమారి ఆత్మకూరు గ్రామంలోని నిర్మల హైస్కూల్లో గల రూమ్‌లను పరిశీలిం చారు. సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అత్యున్నత ప్రమాణాలతో వారం రోజుల్లో ఏర్పాటు చేసే విధంగా తగు సూచనలను చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు తెలిపారు. పోలింగ్ అనంతరం ఈవి ఏం లను భద్రపరుచుటకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని సివిల్ అండ్ మెకానికల్ బ్లాక్‌లో ఉన్న గదులను, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి రవికాంత్, అధికారులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - చేబ్రోలు :** మండలంలో పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల ను పరిశీలించడం జరిగిందని ఈఓపిఆర్ అండ్ ఆర్ జి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం శలపాడు, శేకూరు, వి ఎన్ పాలెం గ్రామాలలో వున్న 8 పోలింగ్ కేంద్రాల పోలింగ్ సిబ్బంది మరియు ఓటర్ల కొరకు వసతి సౌకర్యాలను పరిశీలించారు. కనీస వసతుల్లో భాగంగా వికలాంగుల కొరకు ర్యాంపు సౌకర్యం, పోలింగ్ బూత్ వివరాలు తెలిపే బోర్డు తదతర వసతులు గురించి సిబ్బందితో మాట్లాడారు.

లోకేష్ వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : వర్కింగ్ జర్నలిస్టులకు వేతన సవరణ కోసం వేజ్ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు మీడియా కమిషన్‌ను కూడా ఏర్పాటు చేయాలని ఎపియుడబ్ల్యూజె ప్రతినిధులు శుక్రవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు విన్నవించారు. 23 భగత్‌సింగ్ వర్ధంతి, దేశవ్యాప్త జర్నలిస్టుల కోర్కెల దినం సందర్భంగా శుక్ర వారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో జర్నలిస్టులు కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో తమ డిమాండ్లు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సిహెచ్. జనార్ధన్, భక్తవత్సలం, మార్కండేయులు, జె.రాజేష్, సునీల్ సందీప్, కె.రమేష్‌కుమార్, జె.వెంకటేష్, బి.సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజల్ని మోసం చేసిన వైసిపి : టిడిపి

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రతిపక్ష నాయకుడిగా జగన్ ఉన్న సమయంలో అసెంబ్లీ సాక్షిగా రాజధాని ఇక్కడే ఉంటుందని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానుల పల్లవి ఎత్తుకున్నారని ఆ మేరకు ప్రజలను మోసం చేశారని టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్, ఆర్‌కె కలిసి రాష్ట్రాన్ని, రాజధానిని సర్వనాశనం చేశారని, తాడేపల్లికి ఆయన చేసిందేమీలేదని విమర్శించారు కనీసం ఆయన నివాసం ఉంటున్న సమీపంలో బకింగ్ హామ్ కెనాల్‌పై డబుల్ లైన్ బ్రిడ్జికట్ట లేకపోయారని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీమున్సిల్ కౌన్సిలర్లు కేళి వెంకటేశ్వరరావు, ఇట్లా భాస్కర్, అన్నెం కుసుమ, డి.హరికృష్ణ, డి.గోపి, మాలిక, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్కే

దుగ్గిరాలలో వైసిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-దుగ్గిరాల : మన నిర్ణయం మీద ప్రతి ఒక్కరి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని మంగళ గిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వైసిపి ఆత్మీయ సమావేశంలో ఆర్‌కె మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గంలో బిసి మహిళను అభ్యర్థిగా నిలబెట్టడం జగన్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. జగన్ తీసుకున్న నిర్ణయం సరైనదని నిరూపించాలన్నారు. మంగళగిరి నియోజకవర్గం వైసిపి అభ్యర్థి మురుగుడు లావణ్యను పరిచయం చేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలన చేయాలని ఆలోచనతో జగన్ ప్రజల కోసం పథకాలు ప్రవేశ పెట్టారని గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి జగన్ చేశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల మాట్లాడుతూ తాము మంగళగిరి నియోజకవర్గం నుండి పోటీ చేసినప్పుడు దుగ్గిరాల మండలం నుండి 7500 ఓట్లు మెజార్టీ వచ్చిందని అదేవిధంగా పోటీ చేస్తున్న మురుగుడు లావణ్యను కూడా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూప వాణి, జడ్పిటిసి మేకతోటి అరుణ యార్డు చైర్మన్ షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పార్క్ లో ఓటర్లకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తెనాలి : సార్వత్రిక ఎన్నికల్లో పురపాలక సంఘ పరిధిలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న చెప్పారు. స్థానిక ఐతానగర్ రజకచెరువు కూడలి ఐలమ్మ పార్కులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఓటర్ల అవగాహన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో మొత్తం 151 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. టూ టౌన్ సిఐ సుధాకర్ మాట్లాడుతూ బాధ్యతగా ప్రతి పౌరుడూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అనూష మాట్లాడుతూ నో యువర్ కాండిడేట్, పోలింగ్ సెంటర్ వివరాలను తెలుసుకునే విధంగా యాప్‌లు అందుబాటులో ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ పావులూరు బాలకృష్ణ ప్రసాద్‌ను కమిషనర్ సత్కరించారు. మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు ఆకర్షణీయమైన వేషధారణలో మన ఓటు మన హక్కు ప్లకార్డును ప్రదర్శించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

అమరావతిలో ఆగిన పనులను రెండు నెలల్లో ప్రారంభిస్తాం

రచ్చబండ సభలో నారా లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మైనార్టీలను మోసం చేసింది జగన్ ప్రభుత్వమేనని నారా లోకేష్ అన్నారు. రాష్ట్ర చరిత్ర ఎప్పుడూ లేని విధంగా ముస్లింలపై దాడులు, మైనార్టీ సంక్షేమ కార్యక్రమాల రద్దు, వక్ఫ్ ఆస్తుల కబ్జాలు వైసిపి హయాంలో జరిగాయని లోకేష్ అన్నారు. మంగళగిరి రూరల్ మండలం బేతపూడి, నవులూరు, తాడేపల్లి డోలాస్ నగర్ లలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రచ్చబండ సభల్లో యువనేత పాల్గొన్నారు. రంజాన్ తోఫా, ఇమామ్, మౌజంలకు గౌరవ వేతనం, మసీదుల మరమ్మతుల కోసం నిధులు, పెళ్లి కానుక, విదేశీ విద్య, షాదిఖానాల నిర్మాణం లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టింది టిడిపి ప్రభుత్వమే అన్నారు. రెండు పర్యాలయాలు ఎమ్మెల్యేగా ఆర్కే చేసింది ఏమీ లేదన్నారు. రెండునెలల్లో అమరావతిలో ఆగిపోయిన పనులు ప్రారంభిస్తా మన్నారు. ఆగిపోయిన రాజధాని నిర్మాణ పనులను పూర్తిచేసి, ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన రైతులకు న్యాయంచేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో నన్ను గెలిపిస్తే దేశం మొత్తం మంగళగిరివైపు చూసేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని నారా లోకేష్ తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రాడీపేటలో సిజిజిబి 257వ బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు : చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు స్థానిక బ్రాడిపేటలో 4/17లో బ్యాంకు 257వ శాఖను శుక్రవారం ప్రారంభి ంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్యాంక్ సెంట్రల్ ఆడిటర్ జి.నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు గుంటూరు జిల్లాలో బ్యాంకింగ్ సేవల్లో ప్రముఖ పాత్ర వహిస్తుందని, అంతేగాక జాతీయ స్థాయిలో త్వరితగతిన అభివృద్ధి సాధించందని తెలిపారు. బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వ రరావు మాట్లాడుతూ మార్కెట్ పరిస్థితులకు అతీతంగా సమాజంలో అన్నివర్గాల కస్టమర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు డిపాజిట్లపై అత్యధికంగా 8.60శాతం సిజిజిబి అందిస్తుందన్నారు. విదేశీ విద్య కోసం గడిచిన 2 ఏళ్లలో 550 మంది గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రూ.70 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. అంతే కాకుండ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం తీసుకు వచ్చిన పథకాలను అమలు చేయటంలో బ్యాంక్ నిర్విరామ కృషి చేస్తుందని వివరించారు. ఎనిమిది జిల్లాల్లో 27 లక్షల మంది ఖాతా దారులతో, రూ.22వేల కోట్ల వ్యాపారం సాధించిందని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సెంట్రల్ ఆడిటర్ పి.కిరణ్, జనరల్ మేనేజర్ డాక్టర్ బి.వి. రమణరావు, రీజినల్ మేనేజర్ పీ.వీరారెడ్డి పాల్గొన్నారు.

నూతన శాఖను ప్రారంభిస్తున్న నాగేశ్వరావు, కామేశ్వరరావు తదితరులు

ఎపి గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 5 తరగతిలో, అలాగే 6, 7, 8 తరగతుల్లో మిగిలిన ఖాళీల ప్రవేశానికి ఎపిఆర్ఎస్ క్యాట్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. అదే విధంగా జూనియర్ కాలేజిలు, నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కాలేజి (బాలురు) లో మొదటి సంవత్స రం ప్రవేశాలకు ఎపిఆర్‌జెసి అండ్ డిసి సెట్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కాలేజిల్లో ప్రవేశాలకు ఆసక్తి ఉన్న వారు ఎపిఆర్ఎస్. ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా మార్చి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎపిఆర్ఎస్ క్యాట్ పరీక్ష ఏప్రిల్ 25 ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఎపిఆర్‌జెసి అండ్ డిసి సెట్ మధ్యా హ్నం 2.30 గంటల నుండి 5 గంటల వరకూ 26 జిల్లా ల్లోని కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా లయాల సంస్థ సెక్రెటరీ ఆర్.నరసింహారావు తెలిపారు.

వార్డు పర్యటనలో కమిషనర్, సచివాలయ సిబ్బంది

పట్టణంలో పారిశుధ్యాన్ని పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ పరిధిలోని 33, 34 వార్డులలో పారిశుధ్య పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పరిశీలించారు. ఏడవ డివిజన్‌లో పారిశుధ్య, మురుగునీటి పారుదల, కాలువలలో పూడిక తీత, ఇంటింటి నుంచి తడి చెత్త, పొడి చెత్త సేకరణ వంటివి పరిశీలించారు. ఆయా వార్డులలో వ్యాపారుల ట్రేడ్ లైసెన్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుదలకు చేస్తున్న కృషికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. వ్యాపారులు విధిగా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని చెప్పారు. నిబంధనలు పాటించని వారికి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వార్డులో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ నిషేదిత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్న వ్యాపారికి రూ.1000, అలాగే టీ కప్పులను రోడ్డుపై వేసినందుకు రూ.200 అపరాధరుసం విధించారు. శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు శానిటరీ సెక్రటరీలు పర్యటనలో ఉన్నారు.

ఓటమి భయంతో బ్యాంకు ఖాతాలు జప్తు

ప్రజాశక్తి పొన్నూరు రూరల్ : గత పదేళ్లుగా ప్రజాకంటక పాలనతో దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం చూస్తున్న బీజేపి, ఓటమి భయంతోనే కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల జప్తు చేసిందని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేత జక్కా రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాల జప్తు, భారత్ జోడో న్యాయ్ యాత్రలతో దాదాపు దేశం మొత్తం రాహుల్ గాంధీకి నీరాజనం పలకటంతో ఓటమి ఖాయం అనే భావనలో బీజేపి మరో అప్రజాస్వామిక విధానానికి తెరలేపిందన్నారు. ఎలెక్టోరల్ బండ్ల కుంభకోణం నుంచి గట్టెక్కే అవకాశం లేనందున వ్యవస్థలను ఉపయోగించి కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను జప్తు చేసిందని, ఇది పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. అసమర్థులు దమన నీతితోయుద్ధం గెలవాలని ప్రయత్నం చేస్తారని, తక్షణం కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేసారు.

30న రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తారీకు గుడ్ ఫ్రైడే ఈస్టర్ పర్వదినాలు పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రన్ ఫర్ జీసస్ జెండా ఆవిష్కరణ రాజీవ్ సెంటర్లోని తెలుగుబాప్టిస్ట్ చర్చి ఆవరణలో శుక్రవారం బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరి ఐ జోసఫ్, పాస్టర్ నల్లమోతు విజయరాజు, కలకోటి దేశాయ్ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో మాదాను విజయకుమారి, అసోసియే షన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు జోయాలుక్కాస్ వితరణ

ప్రజాశక్తి చేబ్రోలు : నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కంప్యూటర్ ఎడ్యుకేషన్ కొరకు 10 కంప్యూటర్‌లు, లైబ్రరీ బుక్స్, ఐరన్‌సెల్ఫ్‌ల కొరకు రూ.2లక్షల 5వేల,403 చెక్కును జోయా లుకాస్ పాఠశాలకు అందజేశారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు మాట్లాడుతు గుంటూరు చుట్టుపక్కల ఉన్న ఎనిమిది జడ్ పి హెచ్ స్కూల్స్ కి సుమారు పది లక్షల రూపాయల డొనేషన్ అందించారని తెలిపారు. డిఎస్‌పి వి.పోతురాజు పాఠశాలలకు చెక్కులు పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోయాలుకాస్ అధినేతలు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు

సంగం జాగర్లమూడి హెడ్ వాటర్ వర్క్స్ నుండి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే 685 ఎం.ఎం. డయా సిఐ పంపింగ్ మెయిన్‌లైన్‌పై ఏర్పడిన లీకులకు మరమ్మతులు చేపట్టనున్నందున నగరంలో పలు ప్రాంతాలకు ఈనెల 25, 26వ తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతు పనుల కోసం సంగం జాగర్లమూడి ఫిల్టరేషన్ ప్లాంట్ పూర్తిగా నిలుపుదల చేయాల్సి ఉందన్నారు. సోమవారం ఉదయం సరఫరా అనంతరం పనులు చేపడతారన్నారు. సోమవారం సాయంత్రం నుండి మంగళవారం ఉదయం వరకూ స్థానిక నాజ్ సెంటర్ రిజర్వాయర్ పరిధిలోని 5, 7 డివిజన్లలోని గుంటూరువారి తోట, పొత్తూరువారితోట, గణేష్‌రావు పేట, కొత్తపేట, రాజాగారితోట, రామిరెడ్డితోట 1 నుండి 8 లైన్లు, గంటలమ్మ చెట్టు, చౌత్రా సెంటర్, పూల మార్కెట్, ఎల్బినగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. 26వ తేదీ సాయంత్రం నుండి యధావిధిగా నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. కావున నగర ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి, ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

చలపతి కళాశాలను సందర్శించిన మలేషియా ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న ఎలెన్ మాథ్యూస్

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో శుక్రవారం మలేషియా క్వెస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డీన్, ప్రొఫెసర్ ధాతుక్ డాక్టర్ ఎలెన్ మాథ్యూస్, డైరెక్టర్ డాక్టర్ మహిబుబ్ మహమద్యాకనకల్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట్ర విజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా 'గ్లోబల్ పర్స్‌పెక్టివ్ ఇన్ క్లినికల్ ఎడ్యుకేషన్ ఫాస్టరింగ్ స్టూడెంట్ స్టాఫ్ ఇంటరాక్షన్ త్రూ ఇంటర్నేషనల్ కొలాబరేషన్' అనే అంశంపై విద్యార్థులతో చర్చించారు. చలపతి విద్యా సంస్థల సెక్రెటరీ వై.సుజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎలెన్ మాథ్యూస్ మాట్లాడుతూ క్లినికల్ ఎడ్యుకేషన్ రంగంలో అంతర్జాతీయ సహకారం ద్వారా విద్యార్థి, సిబ్బంది పరస్పర చర్యను ప్రోత్సహించటానికి, సంస్థల యొక్క వివిధ వ్యూహాలను అమలు చేయటానికి దోహద పడుతుందన్నారు. విద్యార్థుల మార్పిడి జాయింట్ రీసెర్చ్ ప్రాజెక్టులు, అధ్యాపకుల శిక్షణ కార్యక్రమాలు, ఆసుపత్రులు లేదా, ఆరోగ్య సంరక్షణ సంస్థలతో భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు వివిధ దేశాల సహచరులతో అనుభవాలు పంచుకోవచ్చని చెప్పారు. అనంతరం అంతర్జాతీయ నీటి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అతిధులను సెక్రెటరీ సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు సత్కరించారు.

జెకెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

చెన్నైకి చెందిన ఎపిసోర్స్ సంస్థ వివిధ దశలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో జెకెసి కాలేజి డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఐదుగురు 3.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు.ఈ సంద ర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన మీరా, రాఘవి, కల్పన, శ్రీదేవి, నసీఫాకు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జె.మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె.ప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ వై.సురేష్ తదితరులు అభినందనలు తెలి పారు.

స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులతో యాజమాన్యం, ఫౌండేషన్ ప్రతినిధులు

నార్త్ సౌత్ ఫౌండేషన్ రూ.11 లక్షల స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

పేద విద్యార్థుల ప్రోత్సాహానికి ఉపకార వేతనాలు ఎంతగానో దోహదపడతాయని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. నార్త్ సౌత్ ఫౌండేషన్(యుఎస్ఎ) ద్వారా అర్హత కలిగిన 44 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున రూ.11 లక్షలు విలువైన స్కాలర్‌షిప్‌లు అందజేశారు. శుక్రవారం కళాశాల యాజమాన్యం, ఫౌండేషన్ ప్రతినిధుల చేతులమీదుగా విద్యార్థులకు చెక్కులు అందించారు. మరికొంత మందికి ఏప్రిల్‌లో స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ అచ్యుతబాబు మాట్లాడుతూ పేద విద్యార్థుల ప్రతిభకు ఆర్థిక సమస్య భారం కాకూడదని వారిని ప్రోత్సహించే లక్ష్యంతో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఫౌండేషన్ విజయవాడ చాప్టర్ కోఆర్డినేటర్ సూరపనేని వెంకటరత్నం మాట్లాడుతూ దేశం మొత్తంలో తమ ఫౌండేషన్ ద్వారా ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం 30 చాప్టర్ల ద్వారా చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్‌వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

26లోగా ఓటరు దరఖాస్తులు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

ఓటరు దరఖాస్తులను సక్రమంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఈఆర్వోలను ఆదేశించారు.శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా ఓటరు దరఖాస్తుల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఈఆర్వోలతో మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 7,8 దరఖాస్తులను మార్చి 26వ తేది నాటికి పరిష్కరించాలన్నారు. నూతన ఓటర్ల నమోదులో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఫారం-6లను క్రమపద్ధతిలో పరిశీలించిన తర్వాత మాత్రమే ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. సీజర్స్ అంశంపై ఎన్ఫోర్సుమెంట్ ఏజన్సీలను అప్రమ్తతం చేయాలని, జిల్లా పరిధిలోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లోనూ నిఘా పటిష్టపర్చాలన్నారు. ప్రతి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కనీసం ఒక కెమెరాతో స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాల ప్రకారం దాదాపు 33 నిత్యావసర సేవల శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందని, వీటిలో ముఖ్యంగా పోలీస్, విద్యుత్, రవాణా, పోస్టల్ తదితర శాఖల ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు, ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులకూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ఎటు వంటి కార్యక్రమాలకైనా ముందుగా అనుమతి తప్పని సరిగా పొందాల్సి ఉందన్నారు. శాంతి భద్రతల నిర్వహణలో అప్రమ్తతంగా ఉండాలని, ఏమైన సంఘటనలు జరిగితే వాటికి సంబంధించిన వాస్తవ వివరాలను ఎన్నికల సంఘానికి తెలియజేసేందుకు నివేదికను వెంటనే సంబంధిత ఆర్‌ఓలు అందించాలన్నారు.సమావేశంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఆర్ఒ, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి నియోజకవర్గ ఆర్ఒ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, డిఆర్ఒ పెద్ది రోజా, ఇతర రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

బిజెపి కుటిల నీతికి ప్రజలే బుద్ధి చెప్పాలి

ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సేవాకుమార్

ప్రజాశక్తి-గుంటూరు

బిజెపి కుటిల నీతికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ టి.సేవాకుమార్ పేర్కొన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును ఖండిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తూ, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుందని విమర్శించారు. రాజకీయ కుట్రలో భాగంగా అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని, కేజ్రీవాల్‌ను ఆమ్ ఆద్మీ పార్టీని చూసి మోడీ భయపడుతున్నారని అన్నారు. గత రెండేళ్ల నుండి ఆప్ నాయకులను ఎన్నికల సమయంలోనే అరెస్టు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అక్రమాలకు పాల్పడిన బిజెపి ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, దాని నుండి ప్రజలను మరల్చడానికి ఈ అరెస్టు జరిగిందన్నారు. ఢిల్లీ ప్రజలకు సుపరిపాలన అందిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రిని అరెస్టు చేసి ఏమి సాధించలేరని అన్నారు. వివిధ రాష్ట్రాలలో ప్రజా ప్రభుత్వాలను కూలదోసి అక్రమంగా బిజెపి పాలిస్తుందని, దానికి ఇక కాలం చెల్లిందని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో దేశవ్యాప్తంగా బిజెపి కుటిల బుద్ధికి ప్రజలు చెంపపెట్టు తీర్పును ఇవ్వనున్నారని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను విడుదల చేయకుంటే దేశవ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు.

జిజిహెచ్‌ని సందర్శించిన మలేషియా బృందం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని మలేషియా వైద్య బృందం సభ్యులు శుక్రవారం సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై సంతప్తి వ్యక్తం చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మలేషియా దేశానికి చెందిన గెస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఫార్మసి ప్రొఫెసర్ డాక్టర్ అల్లన్ మాథ్యూస్, ఫార్మాస్యూటికల్ డైరెక్టర్ డాక్టర్ మహబుబ్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మలేషియా దేశానికి చెందిన గేస్ట్ యూనివర్సిటీ కి చెందిన వైద్యులు చలపతి ఫార్మాసూసైటికల్‌తో ఎంఒయూ కుదుర్చుకునేందుకు వచ్చారని అందులో భాగంగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని కూడా సందర్శించారని ఆయన చెప్పారు. ఈ వైద్యులు ఆసుపత్రి లోని పలు విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆసుపత్రి లో కిడ్నీ, లివర్, గుండె మార్పిడి ఆపరేషన్ లు చేసినట్లు బృందానికి వివరించామని అయన తెలిపారు. ఆసుపత్రిలో క్లినికల్ సర్వీసెస్ రోగులకు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారని అయన చెప్పారు. రోజుకు మూడు వేల మంది కి పైగా వస్తున్నా రోగులకు వైద్య సేవలు అందించడం పై వారు అభినందనలు తెలిపారని అయన చెప్పారు. ఆసుపత్రి అభివృద్ధి చేసేందుకు రోగులకు సేవలు అందించడానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పినట్లు అయన చెప్పారు. కార్యక్రమంలో చలపతి ఫార్మాసిటికల్ డాక్టర్ ఎన్‌వి రామారావు ఉన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

జిఎంసి రిజర్వాయర్ వద్ద అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు

భవిష్యత్ కోసం నీటి పొదుపు అందరి బాధ్యత

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల పరిధిలో సేవ్ వాటర్ -సేవ్ లైఫ్ అనే అంశంతో చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ సకల జీవకోటికి ఆహారం ఎంత ముఖ్యమో నీరు కూడా అంతే ముఖ్యమన్నారు. మన దేశంలో వ్యవసాయం మొదలుకుని వివిధ పరిశ్రమలకు, ఇతర అన్ని కార్యకలాపాలలో నీటి వినియోగం చాలా కీలకంగా ఉందని, పెరుగుతున్న జనాభాని దష్టిలో పెట్టుకుని నీటిని పొదుపుగా వినియోగించాలన్నారు. మకుటం శివ మాట్లాడుతూ బాగా అభివృద్ధి చెందిన రాష్టాలు, దేశాలలో నీరు లేక చాలా ఇబ్బంది పడే పరిస్థితులు వచ్చాయన్నారు. పోటీల్లో టిజెపియస్, అభ్యుదయ మహిళా కళాశాల, జెకెసి కళాశాల, సిమ్స్ కళాశాల వారు వరుసగా ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏబిపి మనోహర్, గుంటూరు ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. జె. వి.సుధీర్‌కుమాం పాల్గొన్నారు.

పరిశుభ్రమైన నీటితో జబ్బుల నుండి రక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

పరిశుభ్రమైన నీటిని త్రాగడం ద్వారా చాలా రకాల జబ్బుల నుంచి రక్షణ పొందవచ్చని, విద్యార్థులందరూ ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాలని జిఎంసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాము అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులకు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ లోలెవల్ వాటర్ రిజర్వాయర్ కేంద్రంలో జరిగిన అవగాహనా కార్యక్రమానికి రాము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఆవరణలో మూడు ట్యాంకులు ఉన్నాయని, తక్కెళ్ళపాడు ప్రధాన రిజర్వాయర్ నుండి వస్తున్న నీటిని రెండు పిపిలు ఉండేలా క్లోరినేషన్ చేసి గుంటూరు నాజ్ సెంటర్‌లోని ఎల్ఎల్ఆర్ కేంద్రం నుంచి పరిసర ప్రాంతాలన్నింటికీ పరిశుభ్రమైన నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి గంటకి నీటిలో క్లోరిన్ శాతాన్ని క్రమ బద్ధీకరించే విధంగా పరీక్షలు నిర్వహిస్తూ ఉంటారని ఈ సందర్భంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ డి.తిరుపతిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధాత్రికుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనిట్ 2 విద్యార్థినులు నీటి వినియోగంపై స్టడీ ప్రాజెక్టుని రూపొందించారు.